సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



మూతపడ్డ మద్ది ఆలయం

జంగారెడ్డిగూడెం రూరల్: చంద్రగ్రహణం సందర్భంగా మద్ది ఆంజనేయస్వామి ఆలయ తలుపులను మూసివేశారు. ఆదివారం ఉదయం 8 గంటలకు తెరవనున్నారు.



చండీ హోమం

భీమవరం (ప్రకాశంచౌక్): మావుళ్లమ్మ ఆలయంలో పౌర్ణమి సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ప్రధానార్చకులు మద్దిరాల మల్లికార్జునశర్మ పూజలు చేశారు.



గ్రామోత్సవం

పెనుగొండ: శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో వడలి తూర్పువీధిలో భవానీ మాత గ్రామోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఆలయంలో విశేష పూజలు చేశారు.

న్యూస్‌రీల్

శ్రీవారి ఆలయం మూసివేత



ప్రధాన ద్వారాలను మూసివేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: చంద్రగ్రహణం సందర్భంగా చినవెంకన్న ఆలయాన్ని శనివారం మధ్యాహ్నం 1 గంటకు అర్చకులు మూసివేశారు. గర్భాలయ ద్వారాలతో పాటు రాజగోపురాలను మూసివేశారు. రాత్రి జరగాల్సిన వాహన సేవను రద్దు చేశారు. ఆదివారం ఉదయం 4 గంటలకు ఆలయ ద్వారాలను తెరిచి ఆలయ శుద్ధి, తిరుమంజనాలు, సంప్రోక్షణ అనంతరం భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పిస్తామని ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు. శ్రీవారి ఉప, దత్తత ఆలయాలు సైతం మూతపడ్డాయన్నారు.

వాల్మీకి జీవితం ఆదర్శనీయం



కలెక్టరేట్‌లో నివాళులర్పిస్తున్న అధికారులు

భీమవరం (ప్రకాశంచౌక్): వాల్మీకి మహర్షి జీవితం ఆదర్శనీయం, స్ఫూర్తిదాయకం అని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రామాయణం వంటి మహాగ్రంథాన్ని అందించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయులన్నారు. జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి జీవీఆర్‌కేఎస్‌ఎస్ గణపతిరావు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి కె.శోభారాణి, అసిస్టెంట్ బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ కె.వెంకటేశ్వరరావు, బీసీ వసతి గృహాల సంక్షేమ అధికారులు, బీసీ వసతి గృహాల విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుల సంక్షేమానికి కృషి



మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా వయోవృద్ధుల నూతన కమిటీ తొలి సమావేశాన్ని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో వృద్ధుల సంక్షేమానికి కృషిచేస్తామన్నారు. జిల్లా వయోవృద్ధుల సంక్షేమం అప్పీలేట్ ట్రిబ్యునల్ మెంబర్ మేళం దుర్గాప్రసాద్, డిప్యూటీ ట్రైనీ కలెక్టర్ కానాల సంగీత్ మాధుర్, ప్రతిభావంతు సంక్షేమ ఏడీ జీసీ హెచ్ ప్రభాకర్, డీసీహెచ్ ఎస్ పి.సూర్యనారాయణ పాల్గొన్నారు.

నరసాపురంలో భారీ వర్షం

నరసాపురం: పట్టణంలో శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో స్టీమర్‌రోడ్డు, బస్టాండ్ ఏరియా, చేపల మార్కెట్, గడ్డిబజార్ రోడ్డు, ప్రకాశం రోడ్డు ప్రాంతాలు జలమయమయ్యాయి.

మంత్రి అంబటిపై దాడి దారుణం

దెందులూరు: రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుపై ఖమ్మంలో దాడి చేయడం బాధాకరమని, ఈ చర్య ప్రజాస్వామ్యానికి విఘాతమని కాపు సంఘం దెందులూరు నియోజకవర్గ అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ సభ్యుడు పోకల రాంబాబు అన్నారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర మంత్రిపై దాడి సంఘటనను ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని బాధ్యులు, చేయించిన వారు, చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కుట్రకోణంపై పూర్తి స్థాయి విచారణ జరిపించాలని కోరారు. ఇటువంటి దాడులు, దౌర్జన్యాలు కాపుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయలేవన్నారు.

కనులపండువగా శ్రీచక్ర స్నానం

నేటితో ముగియనున్న శ్రీవారి బ్రహ్మోత్సవాలు



స్నపన వేడుక నిర్వహిస్తున్న అర్చకుడు, (ఇన్‌సెట్‌లో) ధ్వజావరోహణలో భాగంగా ధ్వజపటానికి హారతులిస్తున్న దృశ్యం

బ్రహ్మోత్సవాల్లో నేడు : ఉదయం 9 గంటల నుంచి చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీ పుష్పయాగం, పవళింపు సేవ. ప్రత్యేక అలంకారం శయన మహావిష్ణువు.

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న ఆశ్వయుజమాస దివ్య బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారికి శ్రీచక్రస్నానాన్ని అర్చకులు వైభవంగా నిర్వహించారు. ముందుగా వెండి తొళక్క వాహనంపై శ్రీవారి తిరువీధి సేవ అట్టహాసంగా జరిపారు. యాగశాలలో స్వామి, అమ్మవార్లు, శ్రీచక్ర పెరుమాళ్ల ఉత్సవమూర్తులను వేదికపై వేంచేపు చేశారు. పూజాధికాల అనంతరం సుగంధ ద్రవ్యాలు, పంచపల్లవులు, శ్రీచందనం, పసుపు, మంత్రపూత అభిషేక తీర్థంతో శ్రీచక్ర స్వామిని అభిషేకించారు. తర్వాత శ్రీచక్ర పెరుమాళ్లతో పాటు ఉభయ నాంచారులకు, శ్రీవారికి తిరుమంజనాలు జరిపి హారతులిచ్చారు. అభిషేక జలాన్ని భక్తుల శిరస్సులపై చల్లారు. అనంతరం నిత్యహోమ బలిహరణలు, పూర్ణాహుతి, అనంతరం ధ్వజావరోహణను నిర్వహించారు. ఆలయ ముఖ మండపంలో శ్రీవారు రాజమన్నార్ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం రాత్రి జరుగనున్న శ్రీపుష్ప యాగోత్సవంతో బ్రహ్మోత్సవాలు పరిసమాప్తమవుతాయని, సోమవారం నుంచి ఆలయంలో నిత్యార్జిత కళ్యాణాలు, ఆర్జిత సేవలు పునః ప్రారంభమవుతాయని ఆలయ ఈఓ వేండ్ర త్రినాథరావు తెలిపారు.



రాజమన్నార్ అలంకారం

సాధికార పథం.. సామాజిక విప్లవం

సంక్షేమ సంతకం

- జీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సముచిత స్థానం
- 90 శాతం పదవులు, పథకాలు బడుగు, బలహీన వర్గాలకే..
- సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో వెలుగులు
- సీఎం జగన్ చొరవతో సామాజిక సంక్షేమం, అభివృద్ధిలో జిల్లా ముందంజ
- చేసిన మేలును వివరిస్తూ వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు చేకూరిన లబ్ధి

పథకం	లబ్ధిదారుల సంఖ్య	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మఒడి	4.32 లక్షలు	648
రైతు భరోసా	1.36 లక్షలు	140
చేయూత	2.08 లక్షలు	389.68
డ్వాక్రా రుణమాఫీ	2.40 లక్షలు	533.90
విద్యాదీవెన	43,800	295.75
వైఎస్సార్ పెన్షన్	62,812	2,880
జగనన్న చేదోడు	69,798	69.30
ఆరోగ్యశ్రీ	2.20 లక్షలు	453.86
ఆసరా	62,812	36.096
ఇళ్లు	70,938	400.50



నరసాపురం నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర (ఫైల్)

భీమవరం (ప్రకాశం చౌక్): బడుగు, బలహీన వర్గాల సంక్షేమం, సమన్యాయం లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు సాగుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు అన్నింటా పెద్దపీట వేస్తూ సామాజిక న్యాయం చేస్తున్నారు. పదవులు, పథకాల్లో ప్రాధాన్యమిస్తూ సామాజిక సాధికారతకు కృషి చేస్తున్నారు. జిల్లాలో వేల కోట్ల రూపాయల పథకాల లబ్ధిని వారికి అందించడంతో పాటు జిల్లాస్థాయి నుంచి రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు అప్పగించారు. వీటన్నింటికీ వివరిస్తూ వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర చేపట్టింది.

పదవుల్లో అగ్రాసనం : జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు శాసనమండలి చైర్మన్, మంత్రులతో పాటు నామిటెడ్ పదవులు, కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్ వంటి పదవుల్లో న్యాయం జరిగింది. దళిత సామాజిక వర్గానికి చెందిన కొయ్యే మోషేన్‌రాజుకు శాసనమండలి చైర్మన్, మేడిది జాన్సన్‌కు రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షులుగా నియమించారు. బీసీ వర్గానికి చెందిన కారుమూరి నాగేశ్వరరావుకు రాష్ట్ర మంత్రి, కవురు శ్రీనివాస్‌కు ఎమ్మెల్సీ, గుబ్బల తమ్మయ్యకు శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్‌గా, ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన పెంట్ర వీరన్నకు సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్‌గా నియమించారు. ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులుగా చెల్లెం ఆనందప్రకాష్, మహిళా కమిషన్ సభ్యురాలిగా బూసి వినీత, టీటీడీ ట్రస్టు బోర్డు సభ్యుడిగా మేకా శేషుబాబు, డీసీఎంఎస్ చైర్మన్‌గా వేండ్ర వెంకటస్వామి, వక్ఫ్ బోర్డు చైర్మన్‌గా ఎండీ కరిముల్లా బాషా తదితరులకు పదవులు అప్పగించారు. అలాగే కార్పొరేషన్ డైరెక్టర్లు, ఏఎంసీలు దేవస్థానం కమిటీలు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీల్లో పెద్దపీట వేశారు.

సంక్షేమ పథకాలకు రూ.5,811 కోట్లు

జిల్లాలో నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు సుమారు రూ.5,811 కోట్లను ఆయా పథకాల కింద అందజేశారు

అంబేడ్కర్ ఆశయాలతో..



సీఎం జగన్ పాలనలో నూటికి నూరుశాతం సామాజిక న్యాయం జరిగింది. బడుగు, బలహీనవర్గాలకు రాజకీయంగా పదవులతో గౌరవించిన ఘనత ఆయనకే దక్కింది. బీసీ నేతలకు రాజ్యసభ సభ్యులుగా అత్యున్నత గౌరవ స్థానాన్ని కల్పించారు. ఎమ్మెల్సీలు, చైర్మన్‌లుగా అవకాశాలు కల్పించి రాజకీయంగా ప్రోత్సహించారు. గాంధీజీ, అంబేడ్కర్ ఆశయాలను కార్యరూపంలోకి తీసుకువచ్చిన సీఎం జగన్‌కు ఆయా వర్గాల అండదండలు ఎప్పుడూ ఉంటాయి.

– గుబ్బల తమ్మయ్య, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్

బలహీన వర్గాలకు పెద్దదిక్కు



ఎస్సీ, ఎస్టీ, బలహీన వర్గాలకు సీఎం జగన్ పెద్దదిక్కుగా నిలిచారు. సంక్షేమ పథకాలను బలహీనవర్గాల దరికి చేర్చడంతో పాటు రాజకీయాల్లో చైతన్యం కావాలని అనేక పదవులు ఎస్సీ, ఎస్టీలకు కేటాయించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నాకు సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించి బలహీన వర్గాలకు తోడ్పడ్డారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక సంక్షేమ పథకాలను అమలుచేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి మాత్రమే దక్కింది.

– పెంట్ర వీరన్న, సంచార జాతుల కార్పొరేషన్ చైర్మన్

ఎన్నడూ లేనివిధంగా..



గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎస్సీ, ఎస్టీలకు ఒక పక్క సంక్షేమ పథకాలను అమలు చేస్తూ మరో పక్క వారికి గౌరవమైన పదవులను అప్పగించారు. దళిత వర్గానికి చెందిన మోషేన్‌రాజుకు శాసనమండలి చైర్మన్‌గా అత్యున్నత గౌరవం ఇచ్చారు. అలాగే దళిత మహిళను రాష్ట్ర హోం మంత్రిని చేసిన ఘనత కూడా సీఎం జగన్‌కే దక్కింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ఏ లోటూ లేకుండా సామాజిక న్యాయం లక్ష్యంగా పాలన సాగిస్తున్నారు.

– మేడిది జాన్సన్, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ చైర్మన్

బీసీ పక్షపాతిగా..



చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా బీసీలను రాజకీయంగా చైతన్యం చేసి బీసీ పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి నిలిచారు. బీసీలకు పథకాలతోపాటు పదవులు కేటాయించి బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్‌బోన్ అని నిరూపించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు నూటికి నూరుశాతం సామాజిక న్యాయం జరిగింది. బీసీ వర్గాలకు చెందిన నేతలను రాష్ట్ర స్థాయి పదవులతో గౌరవించారు.

– కోడే యుగంధర్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు

బస్సు యాత్ర విజయవంతం



లిఖితపూడిలో విలేకరులతో మాట్లాడుతున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు

నరసాపురం రూరల్: గోదావరి జిల్లాల్లో తొలిసారిగా నరసాపురంలో జరిగిన వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర విజయవంతం కావడం ఆనందంగా ఉందని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం ఆయన లిఖితపూడిలో విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ నలుమూలల నుంచి వైఎస్సార్ సీపీ అభిమానులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద ఎత్తున తరలివచ్చారని, వారందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం అంటేనే వైఎస్సార్ సీపీ అని బస్సు యాత్రకు వచ్చిన స్పందన స్పష్టం చేసిందన్నారు. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మేలు, ప్రగతిని తెలియజేయడంతో పాటు ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేలా బస్సు యాత్ర చేపట్టారన్నారు. మరోమారు వైఎస్ జగనే ముఖ్యమంత్రి అని ప్రజల స్పందన, ఓటర్ల నాడి ద్వారా ఇప్పటికే బోధపడిందన్నారు.

నేడు 12 చోట్ల సురక్ష శిబిరాలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లావ్యాప్తంగా ఆదివారం 12 ప్రాంతాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు నిర్వహిస్తామని డీఎంహెచ్ఓ డి.మహేశ్వరరావు తెలిపారు. భీమవరం మండలంలో శివరావుపేట-1, కూర్మయ్యపేట, గంధం వెంకయ్యనాయుడు వీధి, తాడేపల్లిగూడెం మండలంలో దొమ్మేరు కాలనీ, కొత్తూరు, తణుకు మండలంలో పైడిపర్రు, వీరభద్రపురం, గణపవరం మండలంలో కొమర్రు, ఇరగవరం మండలంలో కంతేరు, పాలకోడేరు మండలంలో గరగపర్రు, యలమంచిలి మండలంలో మట్లపాలెం, నరసాపురం మండలంలో తూర్పుతాళ్లలో క్యాంపులు జరుగుతాయన్నారు.

మహిళా ఓటర్లే అధికం



- జిల్లాలో నిర్ణయాత్మక శక్తిగా మహిళలు
- పురుషుల కంటే 28,216 మంది ఎక్కువ
- మొత్తం ఓటర్లు 14,47,509 మంది

నియోజకవర్గాల వారీగా ఓటర్లు

	పురుషులు	మహిళలు	థర్డ్‌జెండర్	మొత్తం
భీమవరం	1,20,857	1,27,428	45	2,48,331
ఉండి	1,08,235	1,12,627	02	2,20,864
తణుకు	1,13,226	1,19,343	06	2,32,575
తాడేపల్లిగూడెం	1,02,752	1,07,631	12	2,10,509
ఆచంట	87,602	89,839	0	1,77,441
పాలకొల్లు	94,391	97,936	10	1,92,337
నరసాపురం	82,545	83,020	01	1,65,566

సాక్షి, భీమవరం: రానున్న ఎన్నికల్లో మహిళలే అభ్యర్థుల జాతకాలను తేల్చనున్నారు. జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో మహిళలదే ఆధిపత్యం కావడం విశేషం. ఓటర్ల సవరణ అనంతరం తాజాగా ప్రకటించిన ఓటర్ల జాబితాలో మహిళలు 7,37,824 మంది ఉండగా పురుషులు 7,09,608 మంది ఉన్నారు. మొత్తం ఓటర్లు 14,47,509 మంది కాగా వీరిలో థర్డ్‌జెండర్ ఓట్లు 77 ఉన్నాయి. భీమవరంలో అత్యధిక ఓట్లు కలిగి ఉండగా నరసాపురంలో తక్కువ ఓట్లు ఉన్నాయి. థర్డ్‌జెండర్స్ కూడా భీమవరం నియోజకవర్గంలో ఎక్కువగా ఉండగా.. ఆచంట నియోజకవర్గంలో ఒక్కటీ నమోదు కాలేదు. ఓట్లు తొలగిస్తున్నారంటూ టీడీపీ, జనసేన నాయకులు గగ్గోలు పెట్టినా జిల్లాలో ఎక్కడా అటువంటి సంఘటనలు లేవు. దీంతో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితాపై కలెక్టర్ నిర్వహించిన సమావేశాల్లో ఎక్కడ అభ్యంతరాలు వ్యక్తం కాలేదు.

రక్తదానం మహోన్నతం



రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ రవిప్రకాష్

సాక్షి, భీమవరం: రక్తదానం చేయడమంటే మరో మనిషికి పునర్జన్మ ప్రసాదించడమే అని ఎస్పీ యు.రవిప్రకాష్ అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శనివారం భీమవరం ఎల్‌హెచ్ టౌన్‌హాల్లో ఏర్పాటుచేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. సుమారు 200 యూనిట్ల రక్తాన్ని సేకరించనున్నట్టు చెప్పారు. డీఎస్పీ బండారు శ్రీనాథ్ పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీలు : పోలీసు సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు 'లైంగిక వేధింపు నుంచి మహిళలు, పిల్లల రక్షణ–సామాజిక పాత్ర' అంశంపై, పోలీసు ఉద్యోగులకు 'సోషల్ మీడియా దుర్వినియోగం, సైబర్ మోసాల అరికట్టడంలో సాంకేతిక పాత్ర' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. పోటీలను పరిశీలించిన ఎస్పీ రవిప్రకాష్ మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేస్తామన్నారు.

వాల్మీకి జయంతి: పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో వాల్మీకి జయంతిని నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి ఎస్పీ రవిప్రకాష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఏఆర్ డీఎస్పీ సత్యనారాయణ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతానికి ఎలక్ట్రీషియన్ మృతి



అబ్బాస్ (ఫైల్)

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై ఓ ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలో మూడో వార్డు శ్రీరామ్ పేటకు చెందిన మొల్ల హైదర్ అబ్బాస్ (24) ఎలక్ట్రికల్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శనివారం ఉదయం శ్రీరామ్‌పేటలోని ఓ ఇంట్లో విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా వైఎస్సార్ సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి గుడాల శ్రీహరి గోపాల రావు (గోపి) అబ్బాస్ కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలిపారు.

ఇంజినీరింగ్ విద్యార్థి ఆత్మహత్య

సాక్షి, భీమవరం: పట్టణంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలో చదువుతున్న ఓ విద్యార్థి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు టూటౌన్ సీఐ జి.శ్రీనివాస్ శనివారం చెప్పారు. ఒంగోలు మండలం త్రోవగుంట గ్రామానికి చెందిన గరిగెల శ్రీను బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన శ్రీను ఈనెల 24న భీమవరం కళాశాల హాస్టల్‌కు తిరిగి వచ్చాడు. అయితే 27వ తేదీన తాను ఉంటున్న హాస్టల్ గదిలో ఫ్యాన్‌కు లుంగీతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. శ్రీను మృతికి కారణాలు తెలియరాలేదు. ఏఎస్ఐ మోహనరావు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కర్రలతో ఇరువర్గాల దాడి

ఆకివీడు: పట్టణంలోని హైవే వద్ద ఇరువర్గాలు శనివారం కర్రలతో ఒకరిపై ఒకరు దాడి చేసుకోవడంతో ఇరువర్గాలకు చెందిన పలువురికి గాయాలయ్యాయి. తెలగపాములకు చెందిన ముగ్గురు, సంతపేట ముఠా కార్మికులు ఆరుగురికి గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగబాబు చెప్పారు.

ఖోఖో, చెస్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక

తాడేపల్లిగూడెం (టీఓసీ) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీలకు ఖోఖో, చెస్ ఉమ్మడి జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల జాబితాను శనివారం రాత్రి పత్రికలకు విడుదల చేశారు. తాడేపల్లిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో ఖోఖో అండర్ 14, -17, చెస్ బాలుర, బాలికల విభాగాల్లో ఇటీవల ఎంపిక పోటీలు నిర్వహించారు. కాగా ఖోఖో అండర్ -17 జిల్లా జట్టు జాబితాను ఇప్పటికే విడుదల చేయడం తెలిసిందే. తాజాగా శనివారం ఖోఖో అండర్-14, చెస్ బాలుర బాలికల జిల్లా జట్లకు ఎంపికైన క్రీడాకారుల వివరాలు ఇలా ఉన్నాయి.

ఖోఖో అండర్-14..

బాలుర విభాగంలో డి.మౌలేష్ (లక్కవరం), సీహెచ్ ఆంజనేయులు (గార్లమడుగు), ఎస్‌డీ షరీఫ్ (రాజవరం), కె.దయా సత్యసాయి (రాజవరం), ఎం.సంపత్‌కుమార్, సాత్విక్ (భీమవరం) జే.చరణ్ (గోకవరం), ఎస్‌డీఎస్ ప్రకాష్ (మోగల్లు), ఈ.రామచరణ్ (రామన్నపాలెం), జి.స్వామి (యర్నగూడెం), ఆర్.సాయి సుధీర్ (తాడేపల్లిగూడెం), బి.మనోజ్, ఎం.రితేష్, (పెదవేగి) జి.వినయ్ (మోగల్లు), కె.లక్ష్మీచరణ్ (తాడేపల్లిగూడెం), భరత్ (కైకరం), బాలికల విభాగంలో జి.నాగదుర్గ (బుట్టాయగూడెం, సీహెచ్ దివ్య (బుట్టాయగూడెం), డి.నిహారిక శ్రీరమ్య (లక్కవరం), కె.హంసలేఖ (బుట్టాయగూడెం), దీపక (గోకవరం), ఎస్.ఈ.పద్మ (తిరుమలపాలెం), ఎస్.లాస్యశ్రీ (కైకరం), పి.జోత్స్న రమ్యశ్రీ (శృంగవృక్షం), ఎ.గాయత్రి (కొణితవాడ) ఎ.దేవిక (రాజవరం), ఎం.దుర్గాభవాని (నల్లజర్ల), ఆర్.శౌరిక (రామన్నపాలెం), కె.రేణుక (బుట్టాయగూడెం), బి.ఉదయ్ పోసేశ్వరీ (నల్లజర్ల), కె.గాయత్రి (సిద్ధాపురం) ఎంపికయ్యారు.



చెస్ పోటీలలో పాల్గొన్న క్రీడాకారులు

చెస్‌లో..

బాలురు విభాగంలో కె.త్రిషాంక్ కోటి (భీమడోలు), పి.సాత్విక్ (వెలివెన్ను), సీహెచ్ సచిన్ (నల్లజర్ల), జి.అఖిల్ సాయి పండరీనాథ్ (ఏలూరు), ఆర్.చింటూ (పెదవేగి), ఎస్.రుత్విక్ (వేలివెన్ను) ఎం.రిషి శ్రీవాస్తవ్ (పాలకొల్లు), ఎ.పూజిత్ (విజ్ఞాన భారతి), పి.డి.ఆదిత్య (వేలివెన్ను), ఏఎస్ఎస్ వీఆర్ కార్తీక్ (చినఅమిరం), డీకేఎస్ఎస్ఎస్ సాయి (తాడేపల్లిగూడెం), కేఎ వర్మ (భీమవరం), పీపీఎస్ ఆక్షాన్‌త్రి (తాడేపల్లిగూడెం). బాలికల విభాగంలో పి.సుచిత్ర (ఏలూరు), ఎస్‌కే సమీరా (సమిశ్రగూడెం), పి.రాజా (కైకరం), పి.బాబ్లి బాల (ఏలూరు), ఎ.శృతి (నిడదవోలు), బి.తన్మయి (ఏలూరు), ఎం.అమృత (పసివేదల), ఎ.నిఖిత (పెనకానమిట్టా), ఎస్.పూజిత (వెలివెన్ను), ఎం.సాత్విక్ (మార్కొండపాడు), వై.నాగతులసి (పసివేదల), ఎ.కావేరి (నిడదవోలు), పి.భవ్య (నాగిరెడ్డిగూడెం), ఎం.లావణ్యదుర్గ (బొమ్మిడి), ఎస్.రమ్య (నాగిరెడ్డిగూడెం) ఎంపికయ్యారు.

30న తణుకు ఆర్టీసీ కార్గోలో లక్కీ డ్రా



తణుకు ఆర్టీసీ కార్గో సెంటర్‌లో మాట్లాడుతున్న వీరయ్యచౌదరి

తణుకు అర్బన్ : ఆర్టీసీ కార్గో డోర్ డెలివరీ బుక్ చేసుకునే వినియోగదారులకు ప్రోత్సాహకంగా కార్గో డోర్ డెలివరీ మాసోత్సవాల్లో భాగంగా తణుకు కార్గో సెంటర్‌లో ఈ నెల 30న లక్కీ డిప్ డ్రా నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.వీరయ్యచౌదరి చెప్పారు. తణుకు ఆర్టీసీ డిపోలో కార్గో సెంటర్‌లో శనివారం ఆయన మాట్లాడారు. లక్కీడిప్ డ్రాలో విజేతలకు తణుకు నరేష్ క్లాత్ షోరూం యాజమాన్యం సహకారంతో విజేతలైన ముగ్గురికి ఫ్యాన్సీ చీరలు, వచ్చేనెల 27న బంపర్ డ్రా ద్వారా విజేతలైన ముగ్గురు వినియోగదారులకు పట్టుచీరలు అందిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజరు ఎస్.గిరిధర్ కుమార్, డీపీటీవో ఆఫీస్ సూపరింటెండెంట్ ఆర్.బాలసుబ్రహ్మణ్యం, తణుకు డిపో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ షేక్‌లాల్ పాల్గొన్నారు.

ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నీ ప్రారంభం



భీమవరంలో చెస్ టోర్నీని ప్రారంభిస్తున్న శ్రీనివాస్, నర్సింహరాజు

సాక్షి, భీమవరం : చదరంగం ద్వారా మేధాశక్తిని పెంపొందించుకోవడమే గాక ఉన్నత విద్య, ఉద్యోగావకాశాలను పొందవచ్చని ప్రభుత్వ విప్, భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్, అనసూయ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో యూత్ కల్చరల్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ ఫైడ్ ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్ ప్రారంభోత్సం సందర్భంగా డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా యూత్ కల్చరల్ అసోసియేషన్ క్రీడల నిర్వహణకు ఎంతో తోడ్పాటు అందిస్తోందన్నారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న చెస్ పోటీలకు 20 రాష్ట్రాల నుంచి 300 మందికి పైగా క్రీడాకారులు హాజరుకావడం అభినందనీయమన్నారు. తొలుత ఎమ్మెల్యే శ్రీనివాస్, నర్సింహరాజు చెస్ పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.భీమారావు, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్, యూత్ కల్చరల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు పేరిచర్ల వెంకట శ్రీనివాసరాజు, కార్యదర్శి కూసంపూడి వెంకట సత్యనారాయణరాజు, ఎంపీపీ పేరిచర్ల విజయనర్సింహరాజు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు తోట బోగయ్య, తోట హరిబాబు పాల్గొన్నారు.

రేపటి నుంచి ట్రిపుల్ ఐటీల్లో తరగతులు

నూజివీడు: ఆర్జీయూకేటీ పరిధిలోని నూజివీడు, ఇడుపులపాయ, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో దసరా సెలవుల అనంతరం ఈనెల 30 నుంచి తరగతులు పునఃప్రారంభం కానున్నాయి. ఈనెల 21 నుంచి 29 వరకు ట్రిపుల్ ఐటీలకు దసరా సెలవులు ప్రకటించడంతో నాలుగు క్యాంపస్‌లలో చదువుతున్న 24 వేల మంది విద్యార్థులు తమ సొంత ఊర్లకు వెళ్లారు. సెలవులు ముగియడంతో క్యాంపస్‌లకు చేరుకోనున్న నేపథ్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు హాస్టళ్లను, మెస్‌లను సిద్ధం చేస్తున్నారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

క్లుప్తంగా

మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ నాయకులు శనివారం మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఇచ్చిన పిలుపులో భాగంగా తాడేపల్లిగూడెం యూనియన్ జిల్లా కార్యదర్శి ధనాల వెంకట్రావు మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, కాంట్రాక్ట్ కార్మికులకు హెల్త్ అలవెన్స్ బకాయిలు, ఈఎస్ఐ, పీఎఫ్, తదితర ఇతర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ ధర్నాలో దానయ్య, కె.బాబు, మిస్సమ్మ, మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

క్రీస్తు సంఘాలు ఐక్యత కలిగి ఉండాలి



సమావేశంలో క్రీస్తు సంఘం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): క్రీస్తు సంఘాలు ఐక్యతతోను, అభివృద్ధి చెందడానికి కృషి చేయాలని చర్చ్ ఆఫ్ క్రైస్ట్ క్రిస్టియన్ థియాలజీ కళాశాల నిర్వాహకులు రొక్కాల నాగబుజ్జి, కళాశాల అధ్యాపకులు ఎం.సత్యానందం, సీహెచ్ శ్రీధర్, పి.మధుకర్‌లు అన్నారు. పట్టణంలోని బైబిల్ కళాశాల వద్ద శనివారం సంఘ సేవకులు సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్రీస్తు సంఘం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గమ్మ గ్రామోత్సవం

పెంటపాడు: దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు పురస్కరించుకొని చింతపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల వద్ద నిర్వహిస్తున్న అమ్మవారి పూజలు ముగిసాయి. ఈ సందర్భంగా గ్రామంలో పూలతో భారీగా అలంకరించిన అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. బాణసంచా, తీన్‌మార్ డప్పులతో ఊరేగించి వెంకయ్య కాలువలో నిమజ్జనం చేశారు. గ్రామ యూత్ సంఘ సభ్యులు పాల్గొన్నారు.

29న ముసాయిదా జాబితా విడుదల



ఈడూరు రైతు భరోసా కేంద్రంలో జాబితాను పరిశీలిస్తున్న రైతులు

అత్తిలి: మండలంలో అన్ని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ-పంట నమోదు ముసాయిదా జాబితాను సామాజిక తనిఖీ నిమిత్తం ప్రదర్శించామని మండల వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ శనివారం తెలిపారు. రైతులు ఈజాబితాను పరిశీలించి తమ వివరాలను చూసుకుని, ఏమైనా తప్పులు ఉంటే ఈనెల 29వ తేదీలోపుగా సంబంధిత రైతుభరోసా కేంద్రాల ఇన్‌ఛార్జ్‌ల ద్వారా సరిచేయించుకోవాలని ఏఓ రాజేష్ కోరారు.

తణుకు కోర్టులో మెడికల్ క్యాంపు



తణుకు కోర్టులో మెడికల్ క్యాంపును పర్యవేక్షిస్తున్న న్యాయమూర్తులు

తణుకు అర్బన్: జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు తణుకు కోర్టులో శనివారం మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. క్యాంపునకు హాజరైన కోర్టు సిబ్బంది, న్యాయవాదులు, కక్షిదారులు 50 మందికి వైద్యాధికారి డాక్టర్ పృథ్వీరాజ్ తన వైద్యబృందంతో కలసి వైద్యసేవలందించారు. సీనియర్ సివిల్ జడ్జి కె.కృష్ణసత్యలత, ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి పీవీఎస్ రంజిత్‌కుమార్, స్పెషల్ మేజిస్ట్రేట్ పీఎస్‌పీ చిరంజీవిరావు పర్యవేక్షించారు.

డ్రగ్ అధికారుల తనిఖీలు

పెంటపాడు: మండలంలోని పెంటపాడు సంతబజార్ ప్రాంతంలో ఓ మెడికల్ షాపుపై వచ్చిన ఫిర్యాదులపై జిల్లా డ్రగ్ అధికారులు శనివారం రాత్రి సోదాలు నిర్వహించారు. దుకాణానికి సంబంధించి అనుమతులు, లైసెన్స్, అక్కడి మందులను పరిశీలించారు. దుకాణంలో ఫార్మసిస్ట్ లేకపోవడంతో పాటు చిన్నపాటి లోపాలను గుర్తించామని తెలిపారు. ఈ తనిఖీల్లో జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ అబిద్ అలీ షేక్, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిణి (డీఐవో) డాక్టర్ సుధాలక్ష్మి, పెంటపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి తోట రాజేష్, సీహెచ్‌వో సుజాత తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికే 'సురక్ష'

- తణుకు, తాడేపల్లిగూడెం డివిజన్లలో పలుచోట్ల జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు
- వేలాది మంది ప్రజలకు ఉన్నత వైద్యం
- ఉచితంగా మందుల పంపిణీ



తాడేపల్లిగూడెం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మండల సచివాలయాల కన్వీనర్ సంపత్ కుమార్



ఇరగవరం : జగనన్న ఆరోగ్య సురక్షలో సభలో మాట్లాడుతున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా కృషి చేస్తున్నారని మండల సచివాలయాల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని పెదతాడేపల్లి-2 సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు సర్పంచ్ పోతుల అన్నవరం అధ్యక్షత వహించారు. సంపత్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ముందు చూపుతో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు మెడికల్ క్యాంపులు నిర్వహిస్తుందన్నారు. వీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సర్పంచ్ పోతుల అన్నవరం మాట్లాడుతూ పేదలు ఇటువంటి వైద్య శిబిరాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం వైద్యులు జి.రూపాదేవి, ఏవీ.వెంకటేష్, అస్మాద్ ఉన్నీసా బేగం, గౌతమిలు 950మందికి వైద్య పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విశ్వనాథ్, ఎమ్పీటీసీ పీవీవీ.సత్యనారాయణ, స్వామి, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రాపాకలో జగనన్న ఆరోగ్య సురక్ష

ఇరగవరం: రాష్ట్ర ప్రజలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీఎంఎస్ డైరెక్టర్ పెన్మెత్స సుబ్బరాజు తెలిపారు. మండలంలోని రాపాకలో శనివారం జగనన్న సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల ద్వారా ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ఆరోగ్య సురక్ష శిబిరాలకు ప్రజలకు ఎంతోగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ప్రజలందరినీ పూర్తి ఆరోగ్య వంతులను చేయడమే జగనన్న ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ శిబిరంలో 1023మంది పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బృందావనం గోపాల కృష్ణ మూర్తి, ఎంపీటీసీ బొల్లా పద్మావతి , మండల పార్టీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, సొసైటీ అధ్యక్షుడు చిట్నీడి రమేష్, నాయకులు దొరబాబు, ఎంపీడీవో ఎ శ్రీనివాస్, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంపూర్ణ ఆరోగ్యానికి సురక్ష

తాడేపల్లిగూడెం అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా అందరికి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆశయమని వైఎస్సార్ సీపీ నాయకులు 14వవార్డు ఇన్‌ఛార్జి బొద్దు సాయిబాబా అన్నారు. స్థానిక 14వవార్డులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమాన్ని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ గోపాలరావు పర్యవేక్షించారు. యాగర్లపల్లి యుహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ అమృత, డాక్టర్ రవి, డాక్టర్ ఆశాజ్యోతి, డాక్టర్ శ్రావ్యలు వైద్యసేవలు అందించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, వార్డు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతోనే పేదలకు లబ్ధి

పెంటపాడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం కార్పొరేట్ వైద్యానికి ధీటుగా నిలుస్తుందని ఎంపీపీ దాసరి హైమావతి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కై గాల శ్రీనివాస్ పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం శనివారం పెంటపాడు మండలం చింతపల్లి గ్రామ ఎంపీయుపీ స్కూల్ వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వేములమంద రాధావెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల ఆరోగ్యం కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారన్నారు. జగనన్న ఆరోగ్యసురక్షను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇక్కడ నయం కాని వ్యాధులు కార్పొరేట్ ఆసుపత్రులకు రిఫర్ చేసే ఈ కార్యక్రమం ప్రజలకు ఎంతో ఉపయోగమన్నారు. రావిపాడు సొసైటీ త్రిసభ్యకమిటీ సభ్యులు దాట్ల రామలింగరాజు మాట్లాడుతూ పేదలకు ఇంటింటికీ ఉచితవైద్యసేవలు అందజేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముప్పిడి సరోజని, పార్టీ నాయకులు వేములమంద జానకిరామరాజు, ఎంపీడీవో సీహెచ్. బాలాజీ, ఈవోపీఆర్డీ ప్రసాద్, గోకా వెంకటేశ్వరరావు(ఎంపీ), ముదునూరు వైద్యాధికారి డాక్టర్ ఎన్వీ రమణ, పెంటపాడు వైద్యాధికారి డాక్టర్ తోట రాజేష్, గ్రామ కార్యదర్శి శోభన్, చక్రవర్తి ప్రత్యేక వైద్యులు డాక్టర్ నవీన్‌కుమార్, కంటి డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, సచివాలయ సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు, ఇతర వైద్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



తాడేపల్లిగూడెం అర్బన్ : 14వ వార్డు ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది



తాడేపల్లిగూడెం అర్బన్ : జగనన్న ఆరోగ్య సురక్ష సమావేశంలో మాట్లాడుతున్న బొద్దు సాయిబాబా



పెంటపాడు: చింతపల్లి ఎంపీయుపీ స్కూల్ వద్ద సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ



పెంటపాడు: ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు మందులు అందజేస్తున్న సర్పంచ్, తదితరులు

పాలస్తీనాపై దాడులను ఖండించాలి



తణుకులో నిరసన చేస్తున్న సీపీఎం నాయకులు

తణుకు: పాలస్తీనాపై ఇజ్రాయేలు యుద్ధాన్ని అందరూ ఖండించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. శనివారం స్థానిక వెంకటేశ్వర థియేటర్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో నిరసన ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ పాలస్తీనాపై గత 75 ఏళ్లుగా ఇజ్రాయేలు దాడులు, అణచివేతలకు పాల్పడుతోందని అన్నారు. పాలస్తీనా భూభాగాన్ని ఇజ్రాయేలు అమెరికా సాయంతో అక్రమంగా ఆక్రమించుకుంటుందన్నారు. ఇప్పటి వరకు ఈ యుద్ధంలో వేలాది మంది అమాయక ప్రజలు చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఐక్యరాజ్యసమితి తక్షణమే జోక్యం చేసుకుని యుద్ధం ఆపేలా చూడాలని ఆహారం, నీరు, విద్యుత్, వైద్యం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కామన మునిస్వామి, గుబ్బల గోపి, బ్రహ్మాజీ, త్రిమూర్తులు, గార రంగారావు, నాగేంద్ర, గోవిందరాజు, బాబు పాల్గొన్నారు.

దళిత శ్మశాన వాటికలపై 30న కలెక్టరేట్ వద్ద ధర్నా



కొత్తూరు గ్రామంలో మాట్లాడుతున్న కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రాంతిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: దళిత శ్మశాన వాటికలపై ఈ నెల 30వ తేదిన కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కే.క్రాంతిబాబు తెలిపారు. శనివారం మండలంలోని కొత్తూరు ఇందిరానగర్ కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ జిల్లాలో దళితులు అభివృద్ధికి నేటికీ దూరంగానే ఉన్నారనడానికి కొత్తూరు ఇందిరానగర్ కాలనీ నిదర్శనమన్నారు. జీవో నెం.1235 ప్రకారం రెండెకరాల భూమిని కొనుగోలు చేసి, శ్మశాన వాటికకు కేటాయించాలని డిమాండ్ చేశారు. దళితులు ఎదుర్కొంటున్న శ్మశాన వాటిక సమస్యపై ఈ నెల 30న జరగనున్న ధర్నాలో దళితులంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు బాబూరావు, వెంకటేశ్వరరావు, భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తాం



జగన్నాథపురంలో ఏఎంసీ చైర్మన్‌గా నియమితుడైన సంపత్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

తాడేపల్లిగూడెం రూరల్: డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ సహాయ, సహకారాలతో మార్కెట్ యార్డు అభివృద్ధికి కృషి చేస్తామని ఏఎంసీ చైర్మన్‌గా నియమితుడైన ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. శనివారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలో ఆయనను పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంపత్‌కుమార్ మాట్లాడుతూ ఏ సదాశయంతో తనను ఏఎంసీ చైర్మన్‌గా నియమించారో వారి ఆశయ సాధనకు కృషి చేస్తానన్నారు. తనకు ఈ పదవినిచ్చిన డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ వైస్‌చైర్మన్‌గా నియమితుడైన చోడగిరి చినబాబు మాట్లాడుతూ తనకు వైస్‌చైర్మన్‌గా అవకాశం కల్పించడం తన జీవితంలో మరిచిపోలేనన్నారు. 2024 ఎన్నికల్లో తాడేపల్లిగూడెం నుంచి మరోసారి కొట్టు సత్యనారాయణ గెలుపునకు కృషి చేస్తామన్నారు. సర్పంచ్‌లు, ఎమ్పీటీసీలు, సొసైటీ చైర్మన్లు, డైరెక్టర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు సంపత్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

గృహనిర్మాణాలు వేగవంతం చేయాలి



చింతపల్లి సచివాలయంలో గృహ నిర్మాణాలపై సమీక్ష నిర్వహిస్తున్న దృశ్యం

పెంటపాడు: మండలంలోని చింతపల్లి గ్రామంలో ఇంకా ప్రారంభించని జగనన్న గృహాలు వేగవంతంగా పూర్తి చేయాలని మండల హౌసింగ్ ఏఈ శివరామకృష్ణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో జగనన్న గృహాల సందర్శనలో భాగంగా చింతపల్లి గ్రామంలో సర్పంచ్ వేములమంద రాధా వెంకటలక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించి లబ్ధిదారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షురాలు ముప్పిడి సరోజని, వైఎస్సార్ సీపీ నాయకులు వేములమంద జానకిరామరాజు, కోరుమిల్లికి చెందిన పార్టీ ఎస్సీ నాయకులు ముప్పిడి సుబ్బారావు, వర్కుఇన్‌స్పెక్టర్ జయరాజు, పుణ్యవతి, కార్యదర్శులు శ్రీరంగ, చక్రవర్తి, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు తణుకు ఐఎంఏలో నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు



తణుకులో విలేకర్లతో మాట్లాడుతున్న ఐఎంఏ కార్యదర్శి రమేష్, వైద్యులు

తణుకు అర్బన్: వైద్యరంగంలో రోజురోజుకీ వస్తున్న నూతన ఆవిష్కరణలను వైద్యులందరికీ పంచాలనే సదుద్దేశ్యంతో ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ), విజయవాడ అను గ్రూప్ ఆఫ్ హాస్పటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం ఐఎంఏ భవనంలో నిరంతర వైద్యవిజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఐఎంఏ కార్యదర్శి బి.రమేష్‌కుమార్ పేర్కొన్నారు. తణుకు ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాలానికి అనుగుణంగా వైద్య రంగంలో ఎన్నో నూతన ఆవిష్కరణలు అందుబాటులోకి వస్తున్నాయని, వాటిని వైద్యరంగంలో ఉన్న వైద్యులందరికీ చేరువ చేసి వైద్యసేవలను మరింత విస్తృతం చేసేందుకు ఈ సదస్సులు ఉపయోగపడతాయని స్పష్టం చేశారు. జిల్లాస్థాయిలో వైద్యులు హాజరయ్యే ఈ సదస్సులో న్యూరాలజీ, కార్డియాలజీ, నియోనటాలజీ, యూరాలజీ, గైనిక్, తదితర విభాగాలకు సంబంధించి 14 మంది నిష్ణాతులైన వైద్యులు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తమ వైద్య నైపుణ్యాన్ని వైద్యులకు పంచుతారని అన్నారు. అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అధికార ప్రతినిధి డాక్టర్ ఎస్.జాఫర్ మాట్లాడుతూ అక్టోబరు 29వ తేదీన వరల్డ్ స్ట్రోక్ డేగా పరిగణించబడుతుందని, స్ట్రోక్ వచ్చిన సందర్భంలో ఆ గోల్డెన్ హవర్స్‌లో వైద్యులు అనుసరించాల్సిన అత్యుత్తమ వైద్య విధానాన్ని సదస్సులో ప్రయోగాత్మకంగా చూపిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ ఎం.రఘు, ఐఎంఏ వైద్యులు డాక్టర్ కేఎస్ఎన్ రాజు, డాక్టర్ వి.సుందరరావు, డాక్టర్ జేవీవీఎస్ ప్రసాద్, డాక్టర్ సుంకవల్లి రామకృష్ణ పాల్గొన్నారు.

జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలి



పైడిపర్రు జగనన్న కాలనీలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కే చెన్నయ్య

తణుకు టౌన్: మండలంలోని జగనన్న కాలనీల్లో ఇంకా ఇళ్ల నిర్మాణం చేపట్టని వారు పది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభించాలని ఆర్డీవో కె చెన్నయ్య కోరారు. శనివారం హౌసింగ్ డే సందర్భంగా తణుకు రూరల్ మండలం పైడిపర్రులోని జగనన్న కాలనీలో లబ్ధిదారులతో నిర్వహించిన అవగాహనా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పైడిపర్రు జగనన్న కాలనీ లేఅవుట్‌లో ఇప్పటి వరకూ 1100 గృహాల నిర్మాణం చేపట్టారని, ఇంకా 1511 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని కోరారు. లబ్ధిదారులు సొంతంగా నిర్మించుకునే వారు పది రోజుల్లో నిర్మాణాలు చేపట్టాలని తెలిపారు. అలా నిర్మించుకోని వారు ఆప్షన్ 3లో నిర్మాణానికి కాంట్రాక్ట్ ఏజెన్సీ ద్వారా నిర్మాణం చేపట్టాలనే వారు సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శిని సంప్రదించి తమ అంగీకారాన్ని తెలియజేయాలని కోరారు. దీనితో పాటు స్వయం సహాయక సంఘాల్లో లేని మహిళలను ఇప్పటికే మనుగడలో ఉన్న స్వయం సహాయక సంఘాల్లో సభ్యులుగా చేర్చి వారికి రూ. 35 వేలు ఆర్థిక సహాయం అందించేలా ఏర్పాట్లు చేయాలని మున్సిపల్, మెప్మా సిబ్బందిని ఆదేశించారు. పైడిపర్రులో లేఅవుట్‌లో స్థలాలు మెరక, రోడ్లు వేసేందుకు రూ. 4 కోట్ల 60 లక్షల నిధులు మంజూరైనట్లు, కాంట్రాక్టర్‌ను కూడా పిలిచినట్లు తెలిపారు. అయితే వరి కోతలు పూర్తి కాగానే మెరక, రోడ్లు వేసే పనులు చేపడతామని చెప్పారు. ఈ సమావేశంలో తహసిల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కేటీ సుధాకర్, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఆర్ఐ భవానీ, ఏఈ కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విజ్ఞానం అందించడమే లయన్స్ ధ్యేయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): భావితరాలకు విజ్ఞానం అందించడం లయన్స్ క్లబ్ ధ్యేయమని, విద్యార్థి దశ నుంచే దేశభక్తి, సేవాభావం, తదితర అంశాలు నేర్పించాలని క్లబ్ కోఆర్డినేటర్ వెల్లంకి సత్యస్వరూప్ అన్నారు. తాడేపల్లిగూడెంలోని జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు కార్యాలయం వద్ద శనివారం జరిగిన కార్యక్రమంలో జిల్లా క్లబ్ సభ్యులు అవినాష్ రాజు, పీఎంజీ ప్రసాద్‌ల సహకారంతో దేశ నాయకులు జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. విద్యార్థులకు వివిధ అంశాలను అవగాహన కల్పించేందుకు పుస్తకాలు ఎంతో ఉపయుక్తమన్నారు. ఈ కార్యక్రమంలో కొమ్ముల మురళీకృష్ణ, నూకల నాగ మల్లేశ్వరరావు, వట్టిప్రోలు రాము, ఆర్‌వీఎస్ సూర్యనారాయణ రాజు, శేషు కుమార్, మల్లికార్జునరావు, రామరాజు, మదన్‌మోహన్ అగర్వాల్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, ఫణి బాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు రంగస్థల కళాకారుల నెలవారీ సమావేశం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నెలవారీ సభా కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు ఈనెల 29వ తేదీ ఆదివారం సాయంత్రం గీతామందిరంలో నిర్వహిస్తున్నట్లు అధ్యక్షుడు సూరంపూడి వెంకట రమణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్ వంశీకృష్ణ, కోశాధికారి మురళీకృష్ణలు తెలిపారు. వైద్యులు అవినాశ్‌కు గౌరవ సత్కారం, గాయకులు మావూరి రామకృష్ణకు కళా సత్కారం, రచయిత కోట రామ ప్రసాద్‌కు ఉద్యోగ సేవ పురస్కారం, సీనియర్ కళాకారులు రాఘవులకు ఆర్థిక సత్కారం చేయనున్నట్లు వెల్లడించారు. కవులు, కళాకారులు, ప్రముఖులు, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

వరాల వెంకటేశ్వరస్వామికి విశేష పూజలు



విశేష అలంకరణలో వరాల వెంకటేశ్వరస్వామి

అత్తిలి: మండలంలోని ఈడూరు గ్రామంలో వేంచేసియున్న వరాల వెంకటేశ్వరస్వామికి శనివారం విశేష పూజలు జరిపారు. వేకువ జామున స్వామి వారికి సుప్రభాతసేవ, తోమాలు సేవ నిర్వహించారు. ఉదయం అర్చనలు జరిపి, ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను జరిపారు. రాత్రి ఊంజల్ సేవ నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకున్నారు. హాజరైన భక్తులకు అన్నదానం చేశారు.

అన్నసమారాధన

అత్తిలి: దేవిశరన్నవరాత్రి మహోత్సవాలు ముగింపు సందర్భంగా అత్తిలి మండలం బల్లిపాడు శ్రీకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద శనివారం ఘనంగా అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో నిర్వహించిన ఈ అన్నదాన కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రక్తదానం మహాదానం



రక్తదాన కార్యక్రమంలో పాల్గొన్న పట్టణ సీఐ నాగరాజు తదితరులు

తాడేపల్లిగూడెం: రక్తదానం మహాదానమని ఇలాంటి కార్యక్రమాల్లో శశి విద్యార్థులు భాగస్వాములు కావడం ఆనందంగా ఉందని పట్టణ సీఐ నాగరాజు అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా శశి ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మాగంటి ఫంక్షన్ హాల్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ప్రిన్సిపాల్ మహమ్మద్ ఇస్మాయిల్ మాట్లాడుతూ ఒక రక్తదాత ఇచ్చిన రక్తంతో ముగ్గురు ప్రాణాలను కాపాడుకోవచ్చొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం, రూరల్ ఎస్ఐ రాజు, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.